జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 7-10-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 127 పేజీలు: 4 వెల : రూ.7

## చత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌తో

# ఉద్దానంలో విషాదం





### మృతుల్లో జిల్లా అగ్రనేతలు

పలాస, అక్టోబర్ 6 (వార్త): ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌తో ఉద్దానంలో విషాదం నెలకొంది. మృతుల్లో జిల్లా అగ్ర నేతలు ఉన్నారు. మావోయిస్టు పార్టీకి గతంలో మంచి పట్టున్న ప్రాంతం శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం ప్రాంతం. అయితే వరుస పోలీస్ అధికారులు అరెస్టులతో ఇక్కడ కొంత కాలం వెనకడుగు వేశారు. అనంతరం ఈ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ ఆలోచనలతో ఉన్న ప్రజా సంఘాలు ఉద్దాన ప్రాంతంలో నిత్య కార్యక్రమాల్లో ముందు ఉన్నారు. అలాంటి ఉద్దానంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగిన ఎదురు కాల్పుల్లో 36 మంది వరకు మృతి చెందిన వార్త తెలుసుకున్న మావోయిస్టు ప్రజా సంఘాలు ఉద్దానవాసులు విషాదంలో మునిగిపోయారు. నిజానికి భారతదేశంలో ఎక్కడైనా సరే మావోయిస్టు పార్టీ చేస్తున్న ప్రజా కార్యక్రమాలకు సంబంధించి అలాగే ఎక్కడ ఎదురు కాల్పుల్లో చనిపోయినా వారి సంఘటనకు సంబంధించి ఉద్దాన ప్రాంతానికి ముడిపడి ఉందని చెప్పక తప్పదు. నిజానికి ఉద్దాన ప్రాంతానికి సంబంధించి 350 మంది మృతి చెందారని పోలీస్ అధికారులు వెల్లడిస్తున్నారు. అనంతరం పీపుల్ వార్ నాయకత్వంలో ఉద్దాన ప్రాంతంలోని అక్కపల్లి, బతుపురం, మామిడిపల్లి, బొడ్డపాడు, రట్టి ఇతర ప్రాంతాల్లో వందలాది మంది పీపుల్ సార్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పోలీస్ కాల్పుల్లో మృతి చెందారని ఆ పార్టీ అభిమానులు ఇప్పటికీ వెల్లడిస్తున్నారు. వారి జ్ఞాపకార్థంగా వజ్రపు కొత్తూరు మండలం బాతుపురంలో అమరవీరుల స్థూపాన్ని నిర్మించారు. అలాగే మఠ్రిపాడు లో కూడా మరో స్థూపం నిర్మించారు. అంతేకాకుండా పలాస మండలం బొడ్డపాడులో అమరవీరుల మెమోరీ హాల్ నిర్మాణం చేసారు. అయితే చత్తీస్‌ఘడ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన నంబళ్ల కేశవతో పాటు వజ్రపు కొత్తూరు మండలానికి చెందిన పసుపు రెడ్డి జోగారావు, చెల్లూరి లక్ష్మణరావులు ఉన్నట్టు సమాచారం రావడంతో ఉద్దాన ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. వాస్తవానికి ఉద్దానం ప్రాంతానికి ఎదురుకాల్పులు విప్లవ ఉద్యమం కారులు మరణాలు ఇక్కడ కొత్తవి కాదని ఉద్దాన ప్రాంతంలోని మాజీ నక్సలైట్లు స్పష్టం చేస్తున్నారు.












జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## సోంపేటలో పీఆర్టీయూ సమావేశం

సోంపేట, అక్టోబర్ 6 (వార్త): స్థానిక రోటరీ క్లబ్ భవనంలో పీఆర్టీయూ ప్రాంతీయ సమావేశం సోంపేట మండల అధ్యక్షులు దాలిబంధు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు, జిల్లా అధ్యక్షులు మురళీమోహన్ పప్పల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు ఇబ్బంది కలిగిస్తున్న జీవో నెంబర్ 117 సిపిఎస్ రద్దు సర్వీసులు సాధన ధ్యేయంగా తాను నిరంతరం సమస్యల సాధనకి ప్రయత్నిస్తున్నట్లు శ్రీనివాసులు నాయుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇచ్చాపురం కవిటి, కంచిలి, మందస, పలాస, సోంపేట, పిఆర్టియు నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# పేరుకే పాన్ షాప్

## అక్కడ అమ్మేది మద్యం సీసాలు పట్టించుకోని అధికారులు

భామిని, అక్టోబర్ 6 (వార్త): గత ప్రభుత్వం ఇప్పటి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు అదుపు చేయాలని ఎన్నో ప్రకటనలు గుప్పిస్తున్న రోజురోజుకు గ్రామాల్లో బ్రాందీ ఏరులై పారుతున్నా పట్టించుకునే అధికారులు లేరని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి గ్రామంలో ఉన్న పాన్ షాప్లు పేరికే తప్ప అందులో అమ్మేది మద్యం అని ప్రతి గ్రామంలో వినిపిస్తుంది పాన్ షాప్‌లో రోజుకి 100 రూపాయలు లాభం వస్తే మద్యంపై వేల రూపాయలు వస్తున్నాయని కనుకనే వ్యాపారులు దీనినే ముఖ్య వ్యాపారంగా ప్రజల వద్ద దోచుకుంటూ వేల రూపాయలు కూడబెట్టుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. పెద్దిమిలి, భామిని మండలాల్లో అనేక గ్రామాల్లో వందలాది బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని అక్కడే ఇష్టారాజ్యంగా అమ్మకాలు సాగిస్తున్నారని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా భామిని మండలం పెద్దదిమిలి గ్రామాల్లో దారుణంగా అమ్మకాలు సాగిస్తున్నారని ఈ విషయం అధికారులకు తెలుసో తెలియదో గానీ ఈ వ్యాపారులు మాత్రం ధీమాతో ఉన్నారు. అధికారులు అంటేనే లెక్కలేని విధంగా బెల్టు షాపు దుకాణదారులు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిఘా వేసి పేదల దగ్గర నుండి దోచుకుంటున్న ఈ బెల్టు షాపు యజమానులపై చర్యలు చేపట్టాలని పలువురు కోరారు.



## రాధాకృష్ణ పేట గ్రామంలో పిచ్చి మొక్కలు తొలగింపు



గార, అక్టోబర్ 6 (వార్త): గార మండలం కళింగపట్నం పంచాయతీ చిన్నపల్లి పేట, రాధాకృష్ణపేటలో పెద్ద పెద్ద తుప్పలను మాజీ సర్పంచ్, జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పొట్నూరు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తొలగించారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, చిన్న పల్లిపేట యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటికొక మొక్కని నాటి పర్యావరణ కాపాడుకోవాలని, బాధ్యత మనందరిపై ఉందని వారు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ పేట యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఇచ్ఛాపురం, అక్టోబర్ 6 (వార్త): బాహుదా నది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు చెప్పారు. ఈదుపురం వంతెన వద్ద కోచెర్ల తాతారావు, మరియు లొద్దపుట్టి ఫ్లై ఓవర్ వద్ద రాజా రెడ్డి, అతని డ్రైవర్‌లను ఇసుక తరలిస్తుండగా రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద

# పటిష్ట నిఘా ఉంచాలి



శ్రీకాకుళం, అక్టోబర్ 6 (వార్త): పైడిభీమవరం వద్ద పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ రవాణా అరికట్టాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. పైడిభీమవరం వద్ద ఉన్న చెక్ పోస్టును జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లతో ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు పాక్షికంగా ఒక షెడ్ వేయాలని, అక్కడ లైటింగ్ తక్కువగా ఉందని మరింత లైటింగ్ పెంచాలని ఆదేశించారు. వాహనాలు ఆపేందుకు స్టాపర్ ఏర్పాటు చేయాలన్నారు. చెక్ పోస్టు వద్ద సిబ్బందిని పెంచి బలోపేతం చేయాలని ఆదేశించారు. చెక్ పోస్టు వద్ద మౌలిక సదుపాయాలు పెంచాలన్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్,ఎస్పీ, వాహనాల తనిఖీల సరళిని పరిశీలించారు. ఈ తనిఖీలో శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె. సాయి ప్రత్యూష, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో శవమై తేలిన యువకుడు

వంగర, అక్టోబర్ 6 (వార్త): మండలంలోని అరసాడ గ్రామానికి చెందిన వ్యక్తి చెరువులో జారిపడి మృతి చెందినట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. ఎస్ఐ షేక్ శంకర్ కథనం ప్రకారం ఈ కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. శనివారం శుకాశి శంకర్(29) అరసాడ గ్రామంలో గల శివాలయం వెనక్కి ఉన్నటువంటి చెరువు సమీ పాన బహిర్భూమికి కాల కృత్యాలు తీర్చుకోవడానికి వెళ్ళాడు. కాలకృత్యాలు పూర్తిచేసుకొని చెరువులోకి కడుక్కొనే నిమిత్తం చెరువులో దిగే సమయంలో కాలు జారి చెరువులో పడి మునిగిపోయినట్లు తెలిసింది. దీంతో ఆయనమృతి చెందాడు. కాలకృత్యాలకు వెళ్ళి ఎప్పటికి రాక పోవటం చూసి కుటుంబ సభ్యులకు అనుమానం కలిగింది. ఆయన కోసం గ్రామమంతా, గ్రామానికి సమీపంలోని ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం చెరువు వద్దకు వెళ్ళి చూడగా చెరువులో మునిగి పోయిన వ్యక్తి వెంటనే నీటి పైకి తేలక పోవటం,గ్రామంలో ఎక్కడా కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు రాత్రంతా తీవ్ర ఆందోళన మధ్య కొట్టు మిట్టాడారు. తెల్లవారి ఆదివారం ఆ చెరువులో శవమై తేలాడు. దీంతో శంకర్ తల్లి గౌరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి,శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజాం ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించినట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు.



## గ్రామంలో శాంతియుత

# వాతావరణం ఉండాలి

శ్రీకాకుళం, అక్టోబర్ 6 (వార్త): శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో గల సానివాడ గ్రామంలో టీడీపీ, వైసీపీ పార్టీలు మధ్య నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా శ్రీకాకుళం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ వారు వారి సిబ్బందితో సమావేశపరిచారు. వారి మధ్య నెలకొనిన తగాదాలను పరిష్కరించేందుకు అవగాహన సదస్సు ఎర్పాటు చేసి, తగు సూచనలను, సలహాలను ఇచ్చారు. భవిష్యత్తులో ఎటువంటి తగాదాలకు, ఘర్షణలకు పోకుండా శాంతి యుతంగా జీవనం సాగించాలని తద్వారా వారి కుటుంబాలకు ఆస్తులకు నష్టం కలగకుండా జీవించాలని చెప్పడం జరిగింది. గతంలో నెలకొనిన చిన్నచిన్న తగాదాలు కారణంగా సానివాడ గ్రామం అత్యంత సమస్యాత్మక గ్రామంగా పోలీస్ రికార్డ్సులో ఉన్నందున భాద్యతాయుతంగా జీవించాలని కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## లక్ష కిస్మిస్ పండ్లతో త్రిపురా సుందరి దేవికి అలంకరణ



భామిని, అక్టోబర్ 6 (వార్త): బత్తిలి గ్రామంలోని శ్రీ త్రిపుర సుందరి దేవి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

ఇందులో భాగంగా త్రిపుర సుందరి దేవి విగ్రహానికి లక్ష కిస్మిస్ పండ్లతో ఆదివారం అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రంప శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దర్శనార్థం అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆధునీకరిస్తాం

**- రాష్ట్ర వ్యాప్తంగా మరో 1500- 2000 తీసుకొస్తాం**

**- నాలుగు నెలల్లోనే శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 11 కొత్త బస్సులను పునరుద్ధరించాం**

**- ఐదు కొత్త బస్సులను ప్రారంభించిన కేంద్ర పౌరవిమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు**



శ్రీకాకుళం, అక్టోబర్ 6 (వార్త): శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తామని కేంద్ర పౌరవిమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. నగరంలోని శ్రీకాకుళం వన్ డిపో పరిధిలో ఐదు కొత్త బస్సులను కేంద్ర పౌరవిమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయిందన్నారు. ఢిల్లీ నుంచి తిరుపతికి ఉన్న ఫ్లైట్ కనక్టవిటీని నిలిపేశారని, తాను బాధ్యతలు చేపట్టిన వెంటనే తిరిగి దానిని పునరుద్ధరించానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఆరు కొత్త ఫ్లైట్ కనెక్టివిటీ పెంచామని ప్రయాణీకులకు రవాణా సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సౌకర్యార్థం మరో 1500 నుంచి 2000 బస్సులను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. సోలార్, ఎలక్ట్రిక్ బస్సులను కూడా నడిపించేందుకు చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నారు. దీని ద్వారా కాలుష్యాన్ని నివారించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సంబంధించి ఎమ్మెల్యే గొండు శంకర్ సమస్యలను పరిశీలించారని తెలిపారు. వర్షం కురిసిన సమయంలో నీరంతా కాంప్లెక్స్ ఆవరణలోనే నిలిచిపోతోందని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతానని హామీనిచ్చారు. గతంలో శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో అభివృద్ధి పనులను సంబంధించి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.45 లక్షలు అందజేశానని గుర్తు చేశారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఏడేళ్లుగా జిల్లా ప్రజలకు అవకాశం లేకుండా పోయిన శ్రీకాకుళం టు విజయవాడ ఇంద్ర బస్సును మరలా పునరుద్ధరించామని వివరించారు. వైసీపీ పాలనలో ఒక్క బస్సు కూడా మరమ్మతు చేయలేదని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా 1437 కొత్త బస్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. శ్రీకాకుళం 1,2 డిపోల పరిధిలో 11 బస్సులను కొత్తగా రన్నింగ్‌లోకి తెచ్చామని త్వరలో మరో 30 బస్సులు రావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా 1 డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ. విజయకుమార్ 1,2 డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ సిబ్బంది, పాల్గొన్నారు.





## రాత్రి గస్తీ విధులు

# పటిష్టంగా అమలు చేయాలి

## జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం, అక్టోబర్ 6 (వార్త): రాత్రి గస్తీ విధులు పటిష్టంగా అమలు చేసి, నేర నియంత్రణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదివారం సాయంత్రం శ్రీకాకుళం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి పలు ముఖ్యమైన రికార్డులు,కేసు ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో సిబ్బంది యొక్క విధి విధానాలు, పనితీరు ఆరా తీసి రాత్రి గస్తీ విధులలో అప్రమత్తంగా తిరుగుతూ నేరాలు నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా కొత్త వ్యక్తులు తారస పడినట్లు అయితే వివరాలపై ఆరా తీయాలని అన్నారు. పాత నేరస్తలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో పలు ముఖ్యమైన అంశాలపై దిశ నిర్దేశాలు చేశారు.





## ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ




నరసన్నపేట, అక్టోబర్ 6(వార్త): నరసన్నపేట మండలంలోని ఉప సర్పంచులకు, వార్డు మెంబర్లకు ఈనెల 7, 8 తేదీల్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఎంపీడీవో బొడ్డేపల్లి మధుసూదనరావు తెలిపారు. పంచాయతీ విధులు, బాధ్యతలు, గ్రామాభివృద్ధిపై వీరికి శిక్షణ ఇస్తామన్నారు. కార్యదర్శుల ద్వారా ఆయా సభ్యులకు సమాచారం అందించామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బెల్ట్ తీయరా..?

- పేరుకే గ్రామాల్లో పాన్ షాప్‌లు
- అక్కడ జరిగేవి మద్యం అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు

(జలుమూరు)

ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు అదుపు చేయాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నా.. అవి కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. రోజు రోజుకు గ్రామాల్లో బ్రాందీ ఏరులై పారుతున్నా పట్టించుకునే అధికారులు లేరని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి గ్రామంలో ఉన్న పాన్ షాపులు పేరుకే తప్ప అందులో అమ్మేది మద్యం అని ప్రతి గ్రామంలో గుసగుసలాడుకుంటున్నారు. పాన్‌షాప్‌లో రోజుకి రూ.100లు లాభం వస్తే మద్యంపై వేల రూపాయలు వస్తున్నాయని, కనుకనే వ్యాపారులు దీనినే ముఖ్య వ్యాపారంగా సాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జలుమూరు, సారవకోట మండలాల్లో అనేక గ్రామాల్లో వందలాది బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని, అక్కడే ఇష్టారాజ్యంగా అమ్మకాలు సాగిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చల్లవానిపేట, సారవకోట, బుడితి గ్రామాల్లో యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారనే విషయం అధికారులకు తెలుసో..తెలియదో గానీ ఈ వ్యాపారులు మాత్రం ధీమాతో ఉన్నారు. అధికారులంటేనే లెక్కలేనివిధంగా బెల్టు షాపు దుకాణదారులు



వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిఘా వేసి బెల్ట్ షాపుల యజమానులపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# వంశధార కాలువపై ఆక్రమణలు తొలగించాలి





జలుమూరు, అక్టోబర్ 6(వార్త): రైతులకు సాగునీరందించే వంశధార ప్రధాన ఎడమ కాలువ రోజురోజుకు అక్రమ ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. రాణా జంక్షన్ నుంచి పెద్దదూగాం జంక్షన్ వరకు ప్రధాన ఎడమ కాలువపై ఆక్రమణల జోరు పెరిగింది.

గతంలో చిన్న చిన్న టెంట్లు వేసుకున్న వ్యక్తులు నేడు భవన నిర్మాణాలు చేపట్టారు. కానీ సంబంధిత వంశధార అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు.

గట్లపై నచ్చిన విధంగా కట్టడాలు చేపట్టడంతో ఏ క్షణంలో అవి కూలిపోతాయేమోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు అధికారులు వచ్చి, పరిశీలించి.. నోటీసులు ఇచ్చినా అక్రమ నిర్మాణాలు మాత్రం తొలగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గట్లు కూలకముందే ఈ ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

# కిడ్నీ వ్యాధి నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలి






పలాస/సోంపేట, అక్టోబర్ 6(వార్త): ఉద్దానంలో కిడ్నీ వ్యాధి నివారణకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని, అందుకు ప్రజా ఉద్యమం సాగాలని, పౌర సమాజంలో చైతన్యం పెరగాలని, వివిధ విభాగాల్లో ఉన్న మేధావులు బాధ్యతగా ముందుకు రావాలని ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ కేఎస్ చలం పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం పలాస మండల పరిషత్ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం, కళింగసీమ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన 'ఉద్దానం కిడ్నీ విషాదాలు" పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ ప్రాంతంలో లేని అందమైన సముద్రతీరం శ్రీకాకుళం జిల్లాలో ఉందన్నారు. అయితే ఈ ప్రాంతీయులు మాత్రం కిడ్నీ మహమ్మారితో పోరాడి చివరికి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. వీటి నివారణకు పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కళింగ సీమ సాహితీ సంస్థ అధ్యక్షుడు సన్నసెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ కిడ్నీ భూతానికి ఇప్పటికే వేల సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడ్డారని, పాలకులకు చిత్తశుద్ధి లేకే ఈ వ్యాధి మరణ మృదంగం మోగిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన బద్రి కూర్మారావు కొన ఊపిరితో ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఊపిరి పోశారని, పాలకులు ఇప్పటికైనా ప్రజల జీవితాలతో చెలగాటం మాని వ్యాధికి గల కారణాలను నిజాయతీగా ప్రజలకు బహిరంగ




పరచాలని డిమాండ్ చేశారు. ఈ విషాదాన్ని అడ్డుకునేందుకు అన్ని వర్గాల వారు ముందుకు వచ్చి ప్రభుత్వం కళ్లు తెరిపించాలని పిలుపునిచ్చారు. వైద్యులు మల్లేశ్వరరావు, తెప్పల ఆనంద్, గొంకల గిరిబాబు, మట్ట ఖగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ కిడ్నీ వ్యాధికి గురై తమ కళ్ల ముందే మృతి చెందిన వ్యక్తులను చూడడం అత్యంత బాధాకరం అన్నారు. అనంతరం పలువురు కవులు, రచయితల రచనా సంకలనాన్ని చలం ఆవిష్కరించారు. ఈ సభలో పుస్తక సంపాదకులు బద్రి కూర్మారావు, ప్రజా సంఘాల నాయకులు కుసుమకుమారి, పలువురు రచయితలు, కళాకారులు పాల్గొన్నారు. పుస్తకాన్ని రచయిత బమ్మిడి సుబ్బారావు సమీక్షించారు. పుస్తకం ముద్రణకు సహకరించిన రచయితలు, కవులు, సాహిత్యకారులు, వైద్యులకు కూర్మారావు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉర్లాంలో మహిళల కుంకుమ పూజలు



నరసన్నపేట, అక్టోబర్ 6(వార్త) : ఉర్లాం గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారు ఆదివారం లలితాదేవి రూపంలో దర్శనమిచ్చారని అర్చకులు కృష్ణమాచార్యులు తెలిపారు. అమ్మవారి మండపం వద్ద మహిళలతో లోకకళ్యాణార్థం అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించామన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారన్నారు.

## బోరు పనిచేయక ఇక్కట్లు



జలుమూరు, అక్టోబర్ 6(వార్త): జలుమూరు మండలం గొటివాడ గ్రామం ఎస్సీ కాలనీలో బోరు పనిచేయక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 2 వారాలుగా బోరు బాగుచేయాలని పంచాయతీ అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. బోరు బాగు చేయక తాగునీటికి, ఇంటి అవసరాలకు.. వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోందంటున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి బోరును బాగు చేయాలని కోరుతున్నారు.

## పోలాకిలో వీధి కుక్కల స్వైర విహారం



పోలాకి, అక్టోబర్ 6(వార్త) : పోలాకి మండల వీధుల్లో కుక్కలు ఆదివారం ఉదయం స్వైర విహారం చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇటీవల కొంతమందిని కుక్కలు గాయపరచడంతో అటుగా వెళ్లడానికి భయపడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరారు.

## మద్యం దుకాణాల దరఖాస్తుకు 9వరకు గడువు

నరసన్నపేట, అక్టోబర్ 6(వార్త) : ప్రైవేటు మద్యం దుకాణాలకు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ అధికారులు కోరారు. రెండేళ్ల కాల పరిమితితో షాపులకు అనుమతిస్తున్నట్లు సీఐ రమణమూర్తి, ఎస్ఐ గురుమూర్తి తెలిపారు. మద్యం దుకాణానికి తొలి ఏడాది రూ.65 లక్షలు, రెండో సంవత్సరం రూ.71.5 లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలని చెప్పారు.




జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## హెల్పింగ్ హాండ్స్ ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం, అక్టోబరు 6(వార్త): తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన దళాయి లింగ రాజు కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ వారు ఆయనకు 7000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సావాడ గణేష్ రెడ్డి, నీలాపు దుర్యోధన, దక్కత శంకర్, మద్ది త్రినాధ్, పనపాన రవి, తిప్పనపుట్టుగ గ్రామస్తులు పాల్గొన్నారు.



## ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి



నరసన్నపేట, అక్టోబర్ 6(వార్త) : నరసన్నపేట మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. చెన్నపురం గ్రామానికి చెందిన దుండంగి కర్రి అప్పన్న అల్లాడ గ్రామంలో జరిగిన బంధువుల ఫంక్షన్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి సైకిల్‌పై వస్తుండగా చోడవరం వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జీవో నెంబర్ 117 రద్దు చేయాలి




సోంపేట, అక్టోబర్ 6(వార్త): సోంపేటలోని రోటరీ క్లబ్ భవనంలో ప్రాంతీయ సమావేశం సోంపేట మండల అధ్యక్షులు దాలిబంధు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు, జిల్లా అధ్యక్షులు మురళీమోహన్, పప్పల రాజశేఖర్ తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇబ్బంది కలిగిస్తున్న జీవో నెంబర్ 117, సీపీఎస్ రద్దు, సర్వీసులు సాధన ధ్యేయంగా పని చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, మందస, పలాస, సోంపేట మండలాల పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## రహదారుల అభివృద్ధికి నిధుల మంజూరు



నరసన్నపేట, అక్టోబర్ 6(వార్త) : నరసన్నపేట మండలంలో వివిధ రహదారుల నిర్మాణానికి ఉపాధి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నరసన్నపేట మండలం కోమర్తి, మునిడిగట్టు, చిక్కాల వలస, జమ్ము పంచాయతీలలో రూ. 4.30 కోట్లతో సీసీ రహదారులతోపాటు బీటీ రహదారుల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఇప్పటికే దీనికి అనుమతులు కూడా దాదాపుగా వచ్చాయని ఆయన స్పష్టం చేశారు.

## అన్నదానం

పలాస, అక్టోబరు 6(వార్త): పలాసలోని 11వ వార్డులో దుర్గా మాత పూజా మహోత్సవాల సందర్భంగా ఆదివారం అన్నదానం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చంద్రశేఖర్ త్యాది, సంతోష్ పండా, నిత్యానంద్ పండా, ఈశ్వర్, దేవేంద్ర, రాము పండా, పూజటి రావినారాయణ పండా, ప్రసాద్ పాత్రో, ప్రశాంత్, మనోజ్ పాల్గొన్నారు.



# అధికారుల కనుసన్నల్లో అక్రమ నిర్మాణం..!



నరసన్నపేట, అక్టోబర్ 6(వార్త) : నరసన్నపేట మార్కెట్ కమిటీ ప్రహరీ గోడకు ఆనుకుని గొట్టిపల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 172లో అక్రమ నిర్మాణం రాత్రి సమయంలో, సెలవుల రోజుల్లో జోరుగా సాగుతోంది. గ్రామ పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు తూతూమంత్రపు పరిశీలనలతో అడ్డుకున్నట్టు నటిస్తూ అక్రమ నిర్మాణానికి ముందుకు తీసుకు పోయారు. దీంతో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో రెస్ట్ రూమ్‌కు కేటాయించిన స్థలం నేడు అన్యాక్రాంతమైపోతోంది. గ్రామపంచాయతీ అధికారులు ఎటు వంటి అనుమతులు లేవని తెలియజేయడం, రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాన్ని నిలుపుదల చేయడంలో చూపుతున్న జాప్యం ఆక్రమణదారులకు కలిసొచ్చింది. ఉదాసీనంగా ఉన్న సంబంధిత రెవెన్యూ ఉద్యోగులకు నోటీసులు అందజేసినా నిర్మాణ పనులు మాత్రం ఆగడం లేదు. లక్షల విలువ చేసే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయిపోతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.



## అరుణోదయలో దసరా వేడుకలు

జలుమూరు, అక్టోబర్ 6(వార్త) : చల్లవానిపేట గ్రామంలో ఉన్న అరుణోదయ పాఠశాలలో ముందస్తు దసరా సంబరాలు జరిపారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ నాటికలు, నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమములో పాఠశాల కరస్పాండెంట్ పి. అప్పల నాయుడు, ప్రిన్సిపాల్ అరుణ, స్వర్ణలత, గీతలత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శిరీష



పలాస, అక్టోబర్ 6(వార్త) : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పండా క్వార్టర్స్ లోని రాజరాజేశ్వరి అమ్మవారిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలాస నియోజకవర్గం ప్రజలకు అమ్మ వారి ఆశీస్సులు ఉండాలి కోరుకున్నట్టు ఆమె తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ సీజ్

మందస, అక్టోబరు 6(వార్త): మందస మండలంలోని గిరిజన ప్రాంతమైన సాబకోట వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ ఎస్.కె.ఖాదర్‌బాషా తెలిపారు. మందస పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ట్రాక్టర్ను స్వాధీనం చేసుకున్నామన్నారు.



# రైతులకు జీడి మొక్కల పంపిణీ

మందస, అక్టోబరు 6(వార్త): మందస మండలంలోని రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జీడి మొక్కల పంపిణీ కార్యక్రమం హరిపురంలో ఆదివారం జరిగింది. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన రైతులకు రాయితీపై మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని, రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి చీడి శంకర్‌దాసు, భాగ్యలక్ష్మి, లబ్బ రుద్రయ్య, ముదుముంచి నవీన్‌కుమార్, కొత్ర వైకుంఠ రావు, బదకల వెంకటరావు, కొత్ర ప్రకాశరావు, రఘుపతి, వసంతరావు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు జీడి మొక్కలు అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పొలం గట్లపై కూరగాయల సాగు

సారవకోట, అక్టోబర్ 6(వార్త): సారవకోట మండలంలో బద్రి, బొడ్డపాడు, బుడితి, సారవకోట తదితర గ్రామాల్లో వరి పొలం గట్లపై రైతులు కూరగాయలు సాగును చేపడుతున్నారు. పొలం గట్టు చుట్టూ వెదురు కర్రలను ఏర్పాటు చేసి చిక్కుడు, బీరకాయల, కాకరకాయలతో పాటు వాణిజ్య పంటలైన కందిని కూడా సాగు చేస్తున్నారు. దీంతో గట్టు శుభ్రంగా ఉండడంతో పాటు కూరగాయలతో ఆదాయం కూడా వస్తుందని రైతులు చెప్పారు.



# ఆవాసాల్లో మురుగు

- పట్టించుకోని అధికారులు
- దశాబ్దాలుగా కాలువలకు నోచుకోని లక్ష్మీపురం



సారవకోట, అక్టోబర్ 6(వార్త): గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా అధికారులతో పాటు మండల అధికారులను ప్రజలు కోరుతున్నప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో రోజూ రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. లక్ష్మీపురం గ్రామంలో వీధులకు రోడ్లు వేశారు తప్ప..కాలువలు నిర్మించలేదు. దీంతో వీధిలో వాడుకనీరు, మురుగు రోడ్లు ప్రవహించి ఆవాసాలు అధ్వానంగా మారుతున్నాయి. దీని ప్రభావంతో గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీ పాలకులు దశాబ్దాలుగా కాలువలు నిర్మించకపోవడం ఆ గ్రామానికి శాపంగా మారింది. గత ప్రభుత్వంలో గ్రామానికి సీసీ రోడ్డు నిర్మించినా, మిగిలిన అభివృద్ధి పనుల్లో ఆ పంచాయతీ ఆమడ దూరంలో ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకోని కాలువ నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 14 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు




వంగర, అక్టోబర్ 6(వార్త) : మద్యం సీసాలతో పట్టుబడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. శివ్వాం గ్రామంలో బెల్టు షాపులు ద్వారా మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయన్న సమాచారం మేరకు ఆదివారం ఆ గ్రామం వెళ్లి తనిఖీలు చేపట్టామన్నారు. ఓ షాపు వద్ద 14 మద్యం సీసాలు పట్టుబడగా, వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ షాపు యజమానిని అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## భారీ అన్నదానం



గార, అక్టోబర్ 6(వార్త) : గార మండలం కళింగపట్నం పెద్దపల్లి పేట గ్రామంలో వేంచేసి ఉన్న హరిహరపుత్ర అయ్యప్ప స్వామి వారి సన్నిధిలో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారి నవరాత్రుల సందర్భంగా ఆదివారం మహా అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. గురుస్వాములు బొడ్డు లక్ష్మయ్య, గంగాడ శ్రీను, దీర్ఘాసి కృష్ణ, ముజేటి రాము ఆధ్వర్యంలో సుమారుగా 2500 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో భవాని కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు బిడియం వెంకటశర్మ పాల్గొన్నారు.

## పిచ్చి మొక్కల తొలగింపు.

గార, అక్టోబర్ 6(వార్త) :గార మండలం కళింగపట్నం పంచాయతీ చిన్నపల్లి పేట, రాధాకృష్ణపేటలో జంగిల్ క్లియరెన్స్‌ను మాజీ సర్పంచ్, జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పొట్నూరు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. తుప్పలను తొలగించి, పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటికొక మొక్కని నాటి పర్యావరణ కాపాడుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాధాకృష్ణపేట చిన్న పల్లిపేట యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ముత్యాలమ్మ కోనేరును అభివృద్ధి చేయాలి



పలాస, అక్టోబరు 6(వార్త): పలాస కాశీబుగ్గలోని ముత్యాలమ్మ కోనేరు (నెహ్రూ పార్క్) అభివృద్ధికి నోచుకోవడం లేదు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ తొలి చైర్మన్‌గా గెలిచిన వజ్జ బాబూరావు ఇక్కడ ఉన్న ముత్యాలమ్మ కోనేరును పర్యాటక ప్రాంతంలా అభివృద్ధి చేశారు. ఆ తర్వాత కోనేరును గాలికి వదిలేశారు. గత ప్రభుత్వం ఈ పార్కును పట్టించుకోలేదు. మున్సిపాలిటీ నుంచి లక్షల రూపాయలు కోనేరు అభివృద్ధికి కేటాయించినా వినియోగించలేదు.

### వజ్జకు వినతి

పలాసలోని ముత్యాలమ్మ కోనేరును అభివృద్ధి చేయాలని వాకర్స్ క్లబ్ వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావుకు అదివారము వినతిపత్రం అందజేశారు. పార్క్ చుట్టూ ఫెన్సింగ్, లైటింగ్, వాటర్ క్లోరినేషన్ లాంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై వజ్జ సానుకూలంగా స్పందించారు.

# మత్స్యకార ఐక్య వేదిక అధ్యక్షునిగా తమ్మయ్య



సోంపేట, అక్టోబర్ 6(వార్త): ఇచ్ఛాపురం తీర ప్రాంత మత్స్యకార ఐక్య వేదిక అధ్యక్షునిగా సోంపేట మండలం ఎకువూరు మత్స్యకార గ్రామానికి చెందిన బడే తమ్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గత పాలకమండలి పదవీ కాలం ముగియడంతో ఇచ్ఛా పురం మండలం డొంకూరు నుంచి సోంపేట మండలం ఎర్రముక్కాం వరకు ఉన్న 17 గ్రామాలకు చెందిన మత్స్యకార ప్రతినిధులతో ఆదివారం బారువ తీరంలో సమావేశం నిర్వహిం చారు. వేదిక మాజీ అధ్యక్షులు మాదా సోమయ్య, మడ్డు రాజారావు తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడిగా కపాసకుద్ది గ్రామానికి చెందిన బడే గురుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఇద్దివానిపాలెం గ్రామానికి చెందిన బైపల్లి దాలయ్య, చినకర్రివానిపాలెం గ్రామానికి చెందిన సూర్ని రమేష్‌ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. తమ సామాజిక వర్గంలోని నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు ఐక్య వేదిక తన వంతుగా కృషి చేస్తుందని ప్రతినిధులు తెలిపారు. ఆ కుటుంబాల్లో పిల్లలకు ఉన్నత చదువులు చదివించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి వారికి ఆర్థిక తోడ్పాటు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

సమావేశంలో ఐక్యవేదిక ప్రతినిధులు సూరాడ చంద్రమోహన్, అమర లోక నాథం, నిట్ట గోపాల్, గండుపల్లి దండాసి, బైపల్లి బాబూరావు, బడే సూర్యనారాయణ, వాసుపల్లి కృష్ణా రావు, మాగుపల్లి పాపారావు, బట్టి మాధవరావు, మడ్డు కుమార్, సాగూరు గురుమూర్తి, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస తదితర పంచా యతీల పరిధిలోని మత్స్యకార నాయ కులు పాల్గొన్నారు.

532001 ... 9963063761, 9160000247, ...016413